క్లుప్తంగా

హరిహర సేవా సమితి అధ్యక్షుడిగా శ్రీధర్



కోదాడరూరల్ : కోదాడ హరిహర సేవా సమితి నూతన అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన మంత్రిప్రగడ శ్రీధర్‌ఎన్నికయ్యారు. సోమవారం పట్టణంలోని సర్వబ్రాహ్మణ భవన్‌లో నిర్వహించిన ఆ సంఘం సర్వ సభ్య సమావేశంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా శ్రీవారణాసి రామ్మూర్తి, ప్రధాన కార్యదర్శిగా ఎంవీఎస్ శర్మ, కోశాధికారిగా సీహెచ్.కృష్ణామాచార్యులు, కార్యవర్గ సభ్యులుగా జె.నాగేంద్రశాస్త్రి, ఎంవీఎస్ శాస్త్రి, ద్రోణా హనుమద్రామశాస్త్రి, ఎన్‌సీహెచ్ రాము, కొత్రా వివేక్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు శ్రీధర్ మాట్లాడుతూ.. హరిహర సేవా సమితి అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని అన్నారు. సేవా సమితి ఆధ్వర్యంలో స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. కాగా అధ్యక్ష పదవి కాలంలో శ్రీధర్ రెండు సంవత్సరాలు కొనసాగనున్నారు.

ఒకే కుటుంబంలో ఇద్దరికి ఎంబీబీఎస్ సీట్లు



విద్యార్థులను అభినందిస్తున్న గ్రామస్తులు

కోదాడరూరల్ : మండలంలోని కాపుగల్లులో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంబీబీఎస్ సీట్లు సాధించారు. గ్రామానికి చెందిన చలసాని జగన్- శ్రీలత దంపతుల మొదటి కుమార్తె ఉష్విని 2022, రెండో కుమార్తె తేజస్వినిలు 2024లో ఎంబీబీఎస్ సీట్లు సాధించారు. ఈ సందర్భంగా సోమవారం గ్రామంలో ఇద్దరు విద్యార్థినులను డీసీసీబీ మాజీ చైర్మన్ ముత్తవరపు పాండురంగారావు ఆధ్వర్యంలో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో నంబూరి లక్ష్మయ్య, నల్లూరి రవి, అన్నబత్తుల సుబ్బారావు, ఉన్నం రాంనరేష్, ప్రవీణ్, వీరబాబు తదితరులు ఉన్నారు.

వాసవి, వనితా క్లబ్ గవర్నర్‌గా విజయలక్ష్మి



నేరేడుచర్ల : వాసవి, వనితా క్లబ్ గవర్నర్‌గా నేరేడుచర్లకు చెందిన రాచకొండ విజయలక్ష్మి ఎన్నికయ్యారు. సోమవారం మఠంపల్లి మండలం మట్టపల్లిలో గవర్నర్‌కు పోస్టుకు ఎన్నికలు నిర్వహించారు. రాచకొండ విజయలక్ష్మి ఒక్కరే నామినేషన్ వేశారు. దీంతో వాసవి క్లబ్ అంతర్జాతీయ ఎగ్జిక్యూటివ్ ఉపాధ్యక్షుడు ఇరుకుమళ్ల రామకృష్ణ, మాజీ గవర్నర్ వంగవీటి గురుమూర్తిలు విజయలక్ష్మిని 2025 సంవత్సరానికి గవర్నర్‌గా ఏకగ్రీవం అయినట్లు ప్రకటించారు. విజయలక్ష్మి ఎన్నిక పట్ల నేరేడుచర్ల ఆర్యవైశ్య సంఘం, వాసవి, వనిత క్లబ్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన



నల్లబండగూడెంలో అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ అనిల్‌రెడ్డి

కోదాడరూరల్ : యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని కోదాడ రూరల్ ఎస్‌ఐ అనిల్‌రెడ్డి సూచించారు. సోమవారం మండలంలోని నల్లబండగూడెంలో పోలీసు కళాజాతా బృందం ఆధ్వర్యంలో డ్రగ్స్, సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత గంజాయి, డ్రగ్స్, గుట్కాలకు అలవాటు తమ జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, మోసగాళ్లు ఫోన్ చేసి వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా, ఓటీపీ వివరాలు అడిగితే చెప్పవద్దని అన్నారు. సైబర్ నేరాలపై 1930 ఫోన్ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. వాహనాలను వేగంగా నడిపి రోడ్డు ప్రమాదాలకు గురికావద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది సురేష్, శ్రీకాంత్ కళాజాతా బృందం సభ్యులు యల్లయ్య, గోపయ్య, గురులింగం, కృష్ణ, చారి పాల్గొన్నారు.

నాలుగు డీఏలను తక్షణమే విడుదల చేయాలి

చిలుకూరు : ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన నాలుగు డీఏలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని సెకండరీ గ్రేడ్ టీచర్ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండా రామాంజనేయులు డిమాండ్ చేశారు. సోమవారం చిలుకూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకనుగుణంగా ప్రతి ఉద్యోగికి ప్రతి ఆరు నెలలకు ఒకసారి డీఏ ఇవ్వడం జరుగుతుందని, కానీ గత రెండేళ్లగా డీఏలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు గురువారెడ్డి, జిల్లా కార్యదర్శి పెండెం రాంబాబు, లింగయ్య పాల్గొన్నారు.

పంట నష్టపరిహారం నిధులు విడుదల

- ఎకరానికి రూ.10 వేలు జమ
- ఇసుక మేటలు, కోతకు గురైన భూముల మరమ్మతులకు సరిపోవని రైతుల ఆవేదన
- రూ.50 వేలు ఖర్చవుతుందని అంచనా



కాగితరామచంద్రాపురం వద్ద పొలంలో ఏర్పడిన ఇసుక మేటలు

నడిగూడెం : గత నెల మొదటి వారంలో కురిసిన భారీ వర్షాలకు నడిగూడెం మండలంలోని పలు గ్రామాల్లో పంట దెబ్బతిని నష్టపోయిన రైతులకు పంట నష్ట పరిహారాన్ని ప్రభుత్వం విడుదల చేసింది. సిరిపురం, రత్నవరం, బృందావనపురం క్లస్టర్ల లోని ఎనిమిది గ్రామాల్లో 201.50 ఎకరాల్లో వరద నీటికి పంట నష్టం జరిగిందని, 135 మంది రైతులు నష్టపోయారని వ్యవసాయ అధికారులు ఉన్నతాధికారులకు నివేదికలు పంపారు. దీంతో ప్రభుత్వం ఈ నెల 11 నుంచి ఎకరానికి రూ.10 వేల చొప్పున పంట నష్టపరిహారం రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నది.

రూ.10 వేలు సరిపోవని రైతుల ఆవేదన..

గత నెల 1న కాగితరామచంద్రాపురం సమీపాన 132, ఖమ్మం జిల్లా వైపు రంగుల వంతెన వద్ద 133 కిలో మీటరు వద్ద సాగర్ ఎడమ కాల్వకు రెండు గండ్లు పడ్డాయి. 132 కిలో మీటరు వద్ద రూ.2.10 కోట్ల వ్యయంతో యుద్ధప్రాతిపదికన కాల్వ గండి మరమ్మతులు పూర్తి చేశారు. కాగా, వరద నీటికి కాగితరామచంద్రాపురం రెవెన్యూ గ్రామ పరిధిలోని పలు గ్రామాల్లో 142.50 ఎకరాల్లో పంట నీట మునిగి నష్టం వాటిల్లింది. దీనిలోనే 40 ఎకరాలకు పైగా ఇసుక మేట వేసింది. ఆ పొలాల్లో బండ రాళ్లు తేలాయి. భూములు కోతకు గురయ్యాయి. అయితే ప్రభుత్వం మంజూరు చేసిన ఎకరానికి రూ.10 వేలు నగదు ఏమాత్రం సరిపోవని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెద్ద ఎత్తున మేటలు వేసిన ఇసుకను తొలగించడం కోసం ఎకరానికి కనీసం రూ.50 వేలు ఖర్చు అవుతుందని పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ఇసుక మేట వేసిన రైతులకు నష్టపరిహారం పెంచి రైతులను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఉపాధ్యాయ ఉద్యోగం సాధించిన పలువురికి సన్మానం



చిలుకూరు : ఉపాధ్యాయ ఉద్యోగం సాధించిన వారిని సన్మానిస్తున్న సీపీఐ నాయకులు



మునగాల: ఉపాధ్యాయ ఉద్యోగం పొందిన వారిని సన్మానిస్తున్న గంధం సైదులు, సీఐ రామకృష్ణారెడ్డి

మునగాల : డీఎస్సీ ఫలితాల్లో ఉపాధ్యాయ ఉద్యోగం సాధించిన మునగాలకు చెందిన నలుగురిని సోమవారం స్థానిక ఓ ఆడిటోరియంలో సామాజిక కార్యకర్త గంధం సైదులు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. విద్యుత్ ఉద్యోగి మారం వెంకటరెడ్డి సహకారంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ ఉద్యోగం సాధించిన తంగెళ్ల శిరీష, కొండ అమూల్య, సిరికొండ అనూష, మండవ దినేష్‌లను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో స్థానిక సీఐ డి.రామకృష్ణారెడ్డి, కేఆర్‌ఆర్ డిగ్రీ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ అర్వపల్లి శంకర్, మాజీ ఎంఈఓ ఒరుగంటి రవి, త్రివేణి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సిరికొండ శ్రీనివాస్, అధ్యాపకులు తాటికొండ శ్రీనివాస్, గ్రంథాలయాధికారిణి దేవబత్తిని లలితాదేవి, గ్రామపెద్దలు, యువకులు పాల్గొన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో..

చిలుకూరు : ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన డీఎస్సీలో మండలంలో ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించిన వారికి సోమవారం చిలుకూరులో సీపీఐ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. నూతన ఉపాధ్యాయులు కొండా విజయలక్ష్మి, మంత్రిప్రగడ అనూష, దుగ్గిబోయిన శ్రీలత, గండు ఆదినారాయణ, షేక్ సైదా, మాదాసు పుష్ప, అనూష, షేక్ అజిమున్నీ బేగం, బోటు నాగలక్ష్మి, కాసాని శైలజ, బోడ వేణు, కొండా వీరలక్ష్మి, ఉత్తపల్లి నాగరాజు, రెమిడాల సైదులు, గుండు రామారావు, రామినేని రవితేజ, నెమ్మాది సతీష్‌తో పాటు పీజీలో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంకు సాధించిన పూల సౌమ్యను సన్మానించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్, జిల్లా, మండల కార్యదర్శులు బెజవాడ వెంకటేశ్వర్లు, మండవ వెంకటేశ్వర్లు, చేపూరి కొండలు, సాహెబ్ అలీ, చిలువేరు ఆంజనేయులు, పిల్లుట్ల కనకయ్య, అలసకాని వెంకటయ్య, గంగిరెడ్డి నాగిరెడ్డి, సోందుమియా, ఉపాధ్యాయులు, ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం నాయకులు పాల్గొన్నారు.

తాళ్లూరి భద్రయ్య చిరస్మరణీయుడు



చిలుకూరు : మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు

చిలుకూరు : ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న తాళ్లూరి భద్రయ్య చిరస్మరణీయుడని సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం మండలంలోని బేతవోలులో నిర్వహించిన మాజీ సర్పంచ్, స్వాతంత్ర్య సమర యోధుడు తాళ్లూరి భద్రయ్య వర్ధంతి సభలో ఆయన మాట్లాడారు. పేద ప్రజల అభ్యున్నతికి పాటు పడిన మహనీయుడు భద్రయ్య అని కొనియాడారు. ముందుగా గ్రామంలో సీపీఐ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి అనంతరం పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం భద్రయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి మండవ వెంకటేశ్వర్లు, పార్టీ జిల్లా, మండల నాయకులు రెమిడాల రాజు, కాంపాటి వెంకటయ్య, తాళ్లూరి రామారావు, పొరండ్ల ఉపేందర్, తాళ్లూరి వెంకటయ్య, పెద మల్లయ్య, వినోద్, ఎగ్గడి శ్రీను, బేతవోలు పీఏసీఎస్ మాజీ వైస్ చైర్మన్ అక్కినపల్లి జానకీరామాచారి, కుటుంబ సభ్యులు తాళ్లూరి శ్రీను, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పాఠశాల జ్ఞాపకాలు గుర్తు చేసుకొని..



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

చిలుకూరు : మండలంలోని బేతవోలు గ్రామంలో గల ప్రతిభ హైస్కూల్‌లో 1996- 97 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థులు సోమవారం గ్రామంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. 28 ఏళ్ల తరువాత ఒకచోట కలుసుకున్న వారు ఆప్యాయంగా పలకరించుకుని తమ పాఠశాల జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వీరస్వామి, రాంబాబు, శ్రీకాంత్‌రెడ్డి, ఆంజనేయులు, లాజర్, లక్ష్మి, నాగేశ్వరరావు, లింగయ్య, రంగారెడ్డి, హరి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఒరిగిన స్తంభాలు.. ప్రజల బెంబేలు



చిలుకూరు - బేతవోలు రోడ్డులో పొలాల్లో ఒరిగి ఉన్న విద్యుత్ స్తంభం



చిలుకూరు అంతర్గంగ వంతెన వద్ద దేవాలయంపై ఒరిగిన విద్యుత్ స్తంభం

చిలుకూరు : మండలంలో పలు చోట్ల విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నాయి. గత నెలలో కురిసిన వర్షానికి విద్యుత్ స్తంభాలు ఒరిగాయి. ఎప్పుడు కూలుతాయో అనే విధంగా ఉన్నాయి. దీంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. అయినా నాటి నుంచి సంబంధిత విద్యుత్ అధికారులు నేటి వరకు మరమ్మతులు చేపట్టలేదు. ప్రధానంగా చిలుకూరు అంతర్గంగ వంతెన వద్ద వర్షానికి నీటి ఉధృతి ఎక్కువై మట్టి కొట్టుకుపోయి విద్యుత్ స్తంభం మడేలమ్మ దేవాలయంపైకి ఒరిగి ఉంది. అదేవిధంగా చిలుకూరు, నారాయణపురం, సీతారాంపురం, సీత్లాతండా, జానకీనగర్ తదితర గ్రామాల్లో, పరిసర ప్రాంత పొలాల్లో సుమారుగా 15 విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ విషయాన్ని గ్రామస్తులు, రైతులు అధికారులకు పలుమార్లు విన్నవించినా వారు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఒరిగి ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించి వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

కాంగ్రెస్ నాయకుల సంతాపం

నడిగూడెం : మండలంలోనిబృందావనపురం సమీపంలో సోమవారం పిడుగుపాటుతో మృతి చెందిన మామిడి రమణ (24) మృతదేహాన్ని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బూత్కూరి వెంకటరెడ్డి సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె కుటుంబానికి సంతాపం తెలిపారు. ఆయన వెంట ఆ పార్టీ నాయకులు గుండు శ్రీను, బాణాల నాగరాజు, తదితరులు ఉన్నారు.

డాక్టర్ సుదర్శన్‌నాయుడు మృతి తీరని లోటు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌కు చెందిన డాక్టర్ సుదర్శన్‌నాయుడు మృతి తీరని లోటని పలువురు నాయకులు అన్నారు. ఆదివారం రాత్రి సుదర్శన నాయుడు గుండెపోటుతో మృతి చెందారు. సోమవారం ఆయన మృతదేహాన్ని పట్టణానికి చెందిన వివిధ పార్టీల, ప్రజాసంఘాల నాయకులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఉపాధి హామీ పనుల గుర్తింపునకు ఆమోదం



గ్రామ సభలో పాల్గొన్న అధికారులు, గ్రామస్తులు

మఠంపల్లి : మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం ఉపాధి హామీ పథకంపై గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా 2025- 2026 సంవత్సరానికి గాను ఉపాధి హామీ పనులు గుర్తించేందుకు ఆమోదం తెలిపారు. భూమి అభివృద్ధి పనులు, పంట కాలువల పూడిక తీత తదితర పనులను ఆమోదించారు. అదేవిధంగా ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల ప్రక్రియలో భాగంగా స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో గల ప్లాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ ఉమాదేవి, కార్యదర్శి విజయ, జూనియర్ అసిస్టెంట్ మట్టయ్య, బిల్ కలెక్టర్ అన్వర్‌పాషా, ఉపాధి హామీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

గరిడేపల్లి : మండల వ్యాప్తంగా ఆవులు, గేదెలు, ఎద్దులు మూడు నెలల వయస్సు పైబడిన దూడలకు మంగళవారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు మండల వైద్యాధికారి రవినాయక్ సోమవారం తెలిపారు. నాలుగు బృందాలు మండలంలో టీకాలు వేయనున్నట్లు తెలిపారు.

నేరేడుచర్ల : మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ నెల 15వ తేదీ నుంచి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు మండల ఇన్‌చార్జ్ పశువైద్యాధికారి బి.రవినాయక్ తెలిపారు. సోమవారం నేరేడుచర్లలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతులు పశువులకు టీకాలు వేయించాలని కోరారు.

రుణమాఫీ వర్తింపజేయాలి

నడిగూడెం : అర్హులైన రైతులందరికీ తక్షణమే రుణమాఫీ వర్తింపజేయాలని తెలుగు రైతు సంఘం రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి కొల్లు వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న తోటి స్నేహితులు

పెన్‌పహాడ్ : మండలంలోని నాగులపాటి అన్నారం గ్రామానికి చెందిన సద్దల తిరుపతి ఇటీవల అనారోగ్యానికి గురై మృతి చెందాడు. దీంతో నాగులపాటి అన్నారం జెడ్పీహెచ్‌ఎస్ 1995-96 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన మృతుడి స్నేహితులు సోమవారం బాధిత కుటుంబానికి రూ. 36వేల ఆర్థికసాయం అందజేశారు. అలాగే 50కేజీల బియ్యాన్ని అందించారు. పెద్ద దిక్కుని కోల్పోయి ఇబ్బందుల్లో ఉన్న తమను ఆదుకోవడం పట్ల తిరుపతి కుటుంబ సభ్యులు వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మృతుడి స్నేహితులు చెరుకుపల్లి వెంకన్న, మేడం వెంకన్న, యగ్గడి నాగయ్య, ఎ. నగేష్, ఉపేందర్‌రెడ్డి, బి. కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై కలెక్టర్‌కు ఫిర్యాదు

మేళ్లచెరువు : మండలంలోని రామాపురం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాలకు భవనాలు నిర్మించకుండానే నిధులు డ్రా చేశారని, నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన యువకులు సోమవారం సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు స్థానిక విలేకరులతో మాట్లాడారు. 2016- 17 సంవత్సరంలో అంగన్‌వాడీ భవనాలు నిర్మించినట్లు రూ.64,38,990 డ్రా చేసినట్లు చూపారని, కానీ నేటి వరకు ఎలాంటి భవనాలు నిర్మించలేదని తెలిపారు. నిధుల దుర్వినియోగానికి పాల్పడిని అప్పటి పాలకులు, అధికారులపై విచారణ జరపాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. కలెక్టర్ వెంటనే విచారణకు ఆదేశించినట్లు వారు పేర్కొన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో రంగిశెట్టి గణేష్ తదితరులు ఉన్నారు.

కుల గణన నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం



మాట్లాడుతున్న బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధనుంజయ నాయుడు

హుజూర్‌నగర్ : రాష్ట్రంలో కులగణన చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించడాన్ని స్వాగతిస్తున్నామని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధూళిపాళ ధనుంజయనాయుడు అన్నారు. సోమవారం హుజూర్‌నగర్‌లోని అనుమాల లింగయ్య భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ కుల గణన చేపట్టి జనాభా దామాషా, నిష్పత్తి ప్రకారం రాజకీయ రిజర్వేషన్‌తో పాటు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని అనేక దశాబ్దాలుగా పలు బీసీ సంఘాలు విభిన్న రూపాల్లో ఆందోళన చేసిన ఫలితంగా ఇది సాధ్యమైందని పేర్కొన్నారు. కులగణన చేపట్టేందుకు ప్రభుత్వం జీఓ నంబర్ 18 జారీ చేయడం బీసీల విజయమని భావిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్, సీపీఐ పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, రైతు సంఘం నాయకులు మామిడి నరసయ్య, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంటు విడుదల చేయాలి



బంద్ పాటిస్తున్న న్యూ అరవింద డిగ్రీ కళాశాల సిబ్బంది

నేరేడుచర్ల : రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంటు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ టీపీడీఎంఏ పిలుపు మేరకు సోమవారం ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల బంద్‌లో భాగంగా నేరేడుచర్లలోని న్యూ అరవింద డిగ్రీ కళాశాల బంద్ చేశారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ కట్ట ప్రవీణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు. గత మూడేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంటు బకాయిలు చెల్లించకపోవడంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా 50 వేల ఉద్యోగుల కుటుంబాలు వీధిన పడే పరిస్థితి నెలకొందని, కళాశాలలు మూతపడేలా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు సైదిరెడ్డి, వెంకటేశ్వర్లు, లింగారెడ్డి, ఆంజనేయులు, సతీష్, శ్రీధర్, శ్రీనివాసాచారి, నాగప్రసాద్, నగేష్ తదితరులు ఉన్నారు.

సాయిబాబాను స్ఫూర్తిగా తీసుకోవాలి



సాయిబాబా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జేఏసీ నాయకులు

కోదాడ : తన జీవిత కాలం మొత్తం ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన దివంగత ఆచార్యుడు సాయిబాబాను స్ఫూర్తిగా తీసుకోవాలని జన చైతన్య వేదిక కన్వీనర్ రామపూడి చిన్ని కోరారు. సోమవారం కోదాడలోని ఎంఎస్ కళాశాలలో జన చైతన్య వేదిక, పూర్వ పీడీఎస్‌యూ విద్యార్థుల ఆధ్వర్యంలో సాయిబాబా సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబా చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. అనారోగ్య సమస్యలు ఎదురైనా, 10 సంవత్సరాలు జైల్లో వేసినా సాయిబాబా తన పోరాటాన్ని ఆపలేదని, అటువంటి మానవతవాది మరణం సమాజానికి తీరని లోటని అన్నారు. కార్యక్రమంలో పందిరి నాగిరెడ్డి, బంగారు నాగమణి, విజయ్‌కుమార్, ఆర్.రామనర్సయ్య, బడుగుల సైదులు, ఉదయగిరి, రాయపూడి వెంకటనారాయణ, నారపరాజు హరికిషన్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

వరి పంటకు తెగుళ్ల బెడద



రత్నవరం వద్ద తెగులు సోకిన వరి పైరు

నడిగూడెం : మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో సాగులో ఉన్న వరి పంటకు తెగుళ్ల బెడద ఏర్పడింది. గత కొద్ది రోజులుగా చలితో కూడిన వాతావరణం, మరో వైపు అధిక ఉష్ణోగ్రత, అధిక వర్షపాతం ఉండడంతో వరి పంటకు విపరీతంగా తెగుళ్లు ఆశించి పంటను నష్టపరుస్తున్నాయి. అయితే పంటకు ఆశించింది తెగులా, పురుగా అని తెలియక రైతులు ఇష్టారాజ్యంగా రసాయన మందులు ఉపయోగిస్తున్నారు. వేల రూపాయలతో రసాయన మందులు పిచికారీ చేసినా తెగుళ్లు, పురుగులు అదుపులోకి రావడం లేదని పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని రైతులు కోరుతున్నారు.

ధరలు నియంత్రించడంలో విఫలం



మాట్లాడుతున్న పారేపల్లి శేఖర్‌రావు

గరిడేపల్లి : నిత్యావసర వస్తువుల ధరలు నియంత్రించడంలో పాలకులు పూర్తిగా విఫలమయ్యారని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పారేపల్లి శేఖర్‌రావు అన్నారు. సోమవారం మండలంలోని కీతవారిగూడెం గ్రామంలో బొమ్మకంటి అంకయ్య అధ్యక్షతన జరిగిన సీపీఎం జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మంచి నూనె, పప్పు దినుసుల ధరలు ఆకాశాన్ని అంటాయన్నారు. కేంద్ర ప్రభుత్వం డీజిల్, పెట్రోల్ ధరలు నియంత్రించడంలో విఫలం చెందిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఎస్‌కే యాకూబ్, మండల కమిటీ సభ్యులు రాఘవయ్య, బొల్లెపల్లి శ్రీనివాస్, తుమ్మల సైదయ్య, నారాయణ, మట్టయ్య, వెంకయ్య, సైదులు, కలమ్మ, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, ధనమూర్తి, వెంకటేష్, వెంకన్న, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

అధ్వాన రోడ్డుపై ప్రయాణించేదెలా..



ఉర్లుగొండ గ్రామంలో గుంతలమయంగా రోడ్డు

మోతె : మండలంలో పలు గ్రామీణ, లింకు రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. రహదారులు గుంతలమయంగా మారి చిన్నపాటి వర్షం వచ్చినా నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. ముఖ్యంగా కూడలి గ్రామం నుంచి మోతె మండల కేంద్రానికి వెళ్లే రహదారి గుంతలుగా ఉంది. 20 కిలో మీటర్ల మేర ఉండే ఈ బీటీ రోడ్డుపై కూడలి, సర్వారం, ఉర్లుగొండ గ్రామాల్లో పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ప్రయాణం ప్రాణ సంకటంగా మారిందని, నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డుపై రాత్రి వేళల్లో అరచేతిలో ప్రాణాలు పెట్టుకొని వెళ్లాల్సి వస్తోందని అంటున్నారు. తండాల రైతులు, బాటసారులు, విద్యార్థులు.. సైకిళ్లు, బైక్‌లపై ప్రయాణించాలంటే నరక యాతన అనుభవిస్తున్నారు. అయితే మండలంలోని ఆయా రోడ్లకు నిధులు మంజూరు అయినందున టెండర్ల ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి నూతన బీటీ రోడ్లు వేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

సాంస్కృతిక సారథి బృందం కళాజాతా

అర్వపల్లి : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల జిల్లా టీం లీడర్ ఈర్ల సైదులు కోరారు. సోమవారం కుంచమర్తిలో తెలంగాణ సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో ప్రజలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాల నిషేధం, గంజాయి నియంత్రణ, పారిశుద్ధ్యం, ఆరోగ్యం, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలపై కళాప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వెన్నెల నాగరాజు, ఎం. శంకర్, గద్దం ఉదయ్, పి. శ్రీకాంత్, మేడిపల్లి వేణు, పి. ఉపేందర్, మంజుల, రాధ, స్రవంతి, శిరీష, గ్రామస్తులు పాల్గొన్నారు.